క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళాలు


అప్పనపల్లిలో దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న పర్యవేక్షకులు సత్యమూర్తి

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారి సన్నిధిలో నిత్యాన్నదానం ట్రస్టుకు గురువారం పలువురు విరాళాలు అందించారు. రాజోలు మండలం చింతలపల్లికి చెందిన అద్దేపల్లి వెంకటనాగకుమార్, సుజాత దంపతులు రూ.10,116 విరాళం అందించారు. భీమవరానికి చెందిన ముదుండి రామజోగిరాజు, అపర్ణస్వాతి దంపతులు రూ.10 వేలు విరాళంగా ఇచ్చారు. ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు దాతలను అభినందించారు.

నిత్యాన్నదానానికి రూ.10,116 విరాళం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి కొత్తపేటకు చెందిన పట్నాల హేమంత్‌కుమార్ కుటుంబ సభ్యులు గురువారం రూ.10,116 విరాళం అందజేశారు. దాత ఈ సొమ్మును ఆలయ అర్చకులు సత్తిబాబుకు అందజేశారు. ఈ మేరకు దాతను సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

వినోద్‌కు బాపు రమణ పురస్కారం



సఖినేటిపల్లి: గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు వినోద్‌కు బాపురమణ పురస్కారం లభించింది. తెలంగాణ భాషా సాంస్కృతిక విభాగం, సత్కళా భారతి హాస్యానందం సంయుక్తంగా ప్రతి ఏడాదీ ఇచ్చే ఈ పురష్కారం వినోద్‌కు వరించింది. మే 20వ తేదీన హైదరాబాద్‌లో ఈ అవార్డు అందుకుంటానని వినోద్ గురువారం తెలిపారు.

విద్యార్థులకు నగదు బహుమతి

అయినవిల్లి: పదో తరగతిలో ఉన్నత మార్కులు సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చేతుల మీదుగా గురువారం నగదు పురస్కారం అందజేశారు. పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వైష్ణవి, జనని, యశస్వీలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా నగదు అందజేశారు. శాలువాతో సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోతంశెట్టి రవిప్రసాద్, స్కూల్ కమిటీ చైర్మన్ అమలకట్ట చక్రవర్తి, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

అంబాజీపేట: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ముక్కామల సబ్‌స్టేషన్ పరిధిలోని ముక్కామల ఫీడర్లలో గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాంబాబు ప్రకటనలో తెలిపారు. ముక్కామల సబ్‌స్టేషన్ పరిధిలోని ముక్కామల, వక్కలంక, పసుపల్లి, తదితర గ్రామాలకు విద్యుత సరఫరా ఉండదన్నారు.

యువకుల కుటుంబానికి పరామర్శ

అంబాజీపేట: సింహాచలం సింహాద్రి అప్పన్న చంద్రోత్సవంలో దుర్మరణం పాలైన అంబాజీపేట కొర్లపాటివారిపాలెంకు చెందిన పత్తి దుర్గాస్వామి నాయుడు, కుంపట్ల మణికంఠ ఈశ్వరశేషరావు కుటుంబ సభ్యులను జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు గురువారం పరామర్శించారు. ఆ యువకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి, శ్రద్ధాంజలి ఘటించారు. పత్తి దత్తుడు, కుంపట్ల శ్రీనివాసరావులకు మనోధైర్యం కల్పించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సూదాబత్తుల రాము, ఉందుర్తి నాగబాబు, మట్టపర్తి బాలాజీ, ముత్తాబత్తుల ప్రశాంత్, పితాని శెట్టి, మట్టా వెంకటేశ్వరరావు, కొర్లపాటి చంటి, బొంతు శ్రీనివాసరావు పరామర్శించిన వారిలో ఉన్నారు.

పీఎంశ్రీ పనులను వేగవంతం చేయాలి

రావులపాలెం: పీఎంశ్రీ ఫేజ్-1లో మంజూరైన పనులను వేగవంతం చేయాలని సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు సూచించారు. మండలంలోని వెదిరేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలను ఏఎంఓ రాంబాబు ఎంఈవో బి.శ్రీనివాసరాజుతో కలిసి గురువారం సందర్శించారు. పాఠశాలలో నిర్మాణ పనులను ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయన పాఠశాల హెచ్‌ఎం కె.నందిబాబు తదితరులకు సూచించారు. పీఎంశ్రీ ఫేజ్-1, 2 ద్వారా జిల్లాలో 26 పాఠశాలలకు రూ.4.01 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. ఈ నిధులతో సంబంధిత పాఠశాలల్లో కెమిస్ట్రీ, బయాలజీ ల్యాబ్‌లు, ఆటస్థలాలు, వాటర్ తదితర పనులు చేపడుతున్నట్టు తెలిపారు.

డ్రైన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మలికిపురం: శంకరగుప్తం మేజర్ డ్రైన్‌లో గురువారం గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం కనుగొన్నట్లు ఎస్సై పీవీవీ సురేష్ తెలిపారు. మృతదేహం బాగా పాడై ఉందని వయస్సు 35- 40 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఎత్తు 5.4 అడుగుల ఉంటుందని, నెక్ బనియను, సిమెంట్ రంగు ఫ్యాంటు ధరించి ఉన్నాడని ఆయన వివరించారు. ఎక్కడయినా ఎవరైనా మిస్ అయి ఉంటే పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.

ఓఆర్‌ఎస్‌తో ఉపశమనం

- ఉష్ణాన్ని తగ్గించే ఉపాయం
- వేసవిలో తప్పనిసరిగా తీసుకోవాల్సిన ద్రావణం
- మోతాదుకు మించి తాగితే అనర్థం


అంబాజీపేటలో ప్రజలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

అంబాజీపేట: రోజురోజుకు ఎండలు మండిపోతున్నాయి. ఉదయం ఎనిమిది గంటల నుంచి భానుడు భగ్గుమంటున్నాడు. మధ్యాహ్నం అయ్యేసరికి ఉష్ణోగ్రతలు తీవ్రరూపం దాల్చేస్తున్నాయి. దాంతో రోజురోజుకూ ఉక్కబోత పెరిగిపోతోంది. ఎంత ఎండలు పనులపై బయటకు వెళ్లాల్సి వస్తుంది. కొంత మంది కార్మికులు ఎండలోనే శ్రమిస్తూ ఉంటారు. ఎండల్లో పని చేసే వారి శరీరంలో నీటి శాతం క్రమేపీ క్షీణించి వ్యాధి నిరోధక శక్తిని కోల్పోతారని వైద్యులు చెబుతున్నారు. ఫలితంగా వడదెబ్బతోపాటు అనేక అనారోగ్యాలకు గురికావాల్సి ఉంటుంది. అలాంటి ప్రమాద సమయంలో ఎటువంటి అనారోగ్యానికి గురి కాకుండా ఉండేందుకు ఓఆర్‌ఎస్ (ఓరల్ రీహైడ్రేషన్ సాల్ట్స్) ద్రావణం ఉపకరిస్తుందని వైద్యాధికారులు చెబుతున్నారు. ఇప్పటికే ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో ఓఆర్‌ఎస్ ద్రావణం తాగడం వల్ల కలిగే ప్రయోజనాలను క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి వివరిస్తున్నారు. పలు కూడళ్లలో సమావేశాలు నిర్వహిస్తున్నారు.

వడదెబ్బ గురైతే..

పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గంలోని 11 మండలాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు, సీహెచ్‌సీ గ్రామాల్లో ప్రజలకు ఓఆర్‌ఎస్ ద్రావణ ప్యాకెట్లు అందిస్తున్న వైద్య సిబ్బందిలలో ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని జింక్ మాత్రలను అందుబాటులో ఉంచారు. తల తిరగడం, నీరసం, తలనొప్పి, జ్వరం, చీకటి కమ్మినట్టు అనిపిస్తూ ఉంటుంది. అలాగే వికారంగా వాంతులు అయ్యే లక్షణాలు కనిపిస్తాయి. ఆ లక్షణాలు ఉన్న వ్యక్తి వడదెబ్బకు గురైనట్లు నిర్ధారణ చేసుకోవాలి. ఈ సమయంలో ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని తాగితే చక్కని ఉపశమనం కలుగుతుందని వైద్యులు వివరిస్తున్నారు.

ఓఆర్‌ఎస్ తీసుకోవాలిలా..

ఓఆర్‌ఎస్ అనేది వివిధ లవణాల మిశ్రమంతో కూడని ద్రావణం. ఈ ద్రావణాన్ని 20.5 గ్రాముల ప్యాకెట్లు రూపంలో అన్ని ప్రాథమిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రుల్లో లభిస్తుంది. ఈ ప్యాకెట్లో 2.6 గ్రాముల సోడియం 1.5 గ్రాముల పొటాషియం, 29 గ్రాములు సోడియం సిట్రేట్, 18.5 గ్రాములు డెక్స్‌ట్రోజ్ ఉంటాయి. ఈ పౌడర్ ప్యాకెట్లను లీటరు నీటిలో కలిపి రోజూ మొత్తంలో వయస్సును బట్టి తగిన మోతాదులో తీసుకోవాలి. రెండేళ్ల లోపు వారు 100 ఎంఎల్ లోపు ద్రావణాన్ని అరస్పూన్ చొప్పున ప్రతి పది నిమిషాలకు ఒకసారి తాగాలి. రెండు నుంచి పదేళ్ల వయస్సు కలిగిన వారు 100 నుంచి 200 ఎంఎం ఒక గ్లాస్ వరకూ ఒక స్పూన్ చొప్పున తాగాలి, పదేళ్ల పైబడిన వారు 50 ఎంఎల్ చిన్న గ్లాస్ చొప్పున ఎండలో సంచరిస్తున్న స్థితిగతులను బట్టి తాగాలి.

అందుబాటులో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు



వేసవికాలం దృష్ట్యా ప్రజల ఆరోగ్య కోసం వడదెబ్బ నుంచి ఉపశమనం కలిగించేందుకు అన్ని సచివాలయాలు, వైద్యారోగ్య కేంద్రాల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాం. ఓఆర్‌ఎస్ ద్రావణం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి ఇంటింటికి వెళ్లి మా సిబ్బంది వివరిస్తున్నారు. ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. ఒక్కో ఆశ వద్ద 100 ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్లు ఉంటున్నాయి.

– కె.ఎస్.శ్రీనివాస్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, అంబాజీపేట

'యర్రంశెట్టి' పరిశోధన పత్రానికి అవార్డు


విజయ్ సత్యప్రసాద్ యర్రంశెట్టి

మామిడికుదురు: అహ్మదాబాద్‌కు చెందిన జర్నల్ ఆఫ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్, ఇన్నోవేటివ్ రీసెర్చ్ జర్నల్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు డిగ్రీ కళాశాలకు చెందిన ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి డాక్టర్ విజయ్ సత్యప్రసాద్ యర్రంశెట్టి సమర్పించిన ది సింబయోటిక్ రిలేషన్‌షిప్ బిట్వీన్ ఎలక్ట్రానిక్స్, వై-ఫై ఇన్ డ్రైవింగ్ మోడరన్ టెక్నాలజీ పరిశోధనా పత్రాలకు ఉత్తమ రీసెర్చ్ పేపర్ అవార్డు వచ్చింది. ఆ జర్నల్‌కు ముఖ్య సంపాదకులుగా వ్యవహరించిన అచార్యులు హితేష్ పాటిల్, పారిస్ పాటిల్ గురువారం ఈ విషయాన్ని తెలియజేశారని సత్యప్రసాద్ తెలిపారు. వివిధ రాష్ట్రాలకు చెందిన 130 మంది ప్రముఖ పరిశోధకులు సమర్పించిన రీసెర్చ్ పేపర్లలో యర్రంశెట్టి రీసెర్చ్ పేపర్‌లో 93 శాతం నూతన అంశాలను చేర్చిన కారణంగా ఎడిటోరియల్ బోర్డు సభ్యులు ఈ అవార్డుకు ఎంపిక చేశారన్నారు. ఈ సందర్భంగా సత్యప్రసాద్‌ను పలువురు అభినందించారు.

7న ఆలయ భూముల కౌలు వేలం

సఖినేటిపల్లి: మోరి గ్రామ శివాలయం భూముల కౌలు వేలం ఈ నెల 7వ తేదీన ఆలయం వద్ద జరుగుతుందని ఆలయ అధికారులు గురువారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు తగిన ధరావత్తుతో వేలంలో పాల్గొనవచ్చునని అధికారులు తెలిపారు.

పోలీస్ బందోబస్తుతో బైపాస్ రోడ్డు పనులు


గెద్దాడ గ్రామంలో భారీగా మోహరించిన పోలీసులు

మామిడికుదురు: గెద్దాడ గ్రామంలో ఎంతో కాలం నుంచి నిలిచిపోయిన బైపాస్ రోడ్డు నిర్మాణం పనులను భారీ పోలీస్ బందోబస్తు నడుమ గురువారం ప్రారంభించారు. పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు పర్యవేక్షణలో నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు భారీగా మోహరించారు. రోడ్డు నిర్మాణం పనులను అడ్డుకునేందుకు గ్రామస్తులు ప్రయత్నించగా పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకుని తరువాత విడిచిపెట్టారు. రోడ్డు నిర్మాణం పనులు ఇప్పటికే ఆలస్యమయ్యాయని, దీనిపై ఏదైనా సమస్య ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించుకోవాలని ఎస్సై చైతన్యకుమార్ చెప్పారు. శ్మశాన వాటిక స్థలంలో బైపాస్ రోడ్డు నిర్మిస్తున్నారని, దానికి ప్రత్యామ్నాయ స్థలం చూపాలంటూ గ్రామస్తులు గత కొన్నేళ్ల నుంచి డిమాండ్ చేస్తున్నారు. దీంతో సుమారు పదేళ్ల నుంచి గెద్దాడ గ్రామ పరిధిలోని కొంత భాగంలో బైపాస్ రోడ్డు నిర్మాణం పనులు నిలిచిపోయాయి. దీనిపై స్పందించిన అధికారులు ఎట్టకేలకు పోలీసు బందోబస్తు నడుమ రోడ్డు నిర్మాణం పనుల్ని ప్రారంభించారు.

సమ్మర్ క్లాసులను తనిఖీ చేసిన డీఈవో


రావులపాలెంలో సమ్మర్ క్లాస్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో సలీం బాషా

రావులపాలెం: ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిర్వహిస్తున్న సమ్మర్ క్లాస్‌లు విజయవంతంగా నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా తెలిపారు. రావులపాలెం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్లాస్‌లను డీఈవో బాషా గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో బాషా మాట్లాడుతూ జిల్లాలో రాజోలు, అమలాపురం, ముమ్మిడివరం, కొత్తపేట, రావులపాలెం, మండపేట, ఏడిద, రామచంద్రపురంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని విధంగా ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల సహకారంతో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులకు ఆయా సబ్జెక్టుల్లో బేసిక్స్ నేర్పిస్తున్నట్టు తెలిపారు. ఏప్రిల్ 24 నుంచి ప్రారంభమైన సమ్మర్ క్లాస్‌లు ఈ నెల పదో తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఆయన వెంట మండల విద్యాశాఖాధికారులు ఆర్.నాగకుమార్, బి.శ్రీనివాసరాజు, పాఠశాల హెచ్‌ఎంలు జానకీదేవి, సీఆర్‌ఎంటీలు మల్లేశ్వరపు నాగరాజు, మొల్లేటి రాజేంద్రప్రసాద్, మారే శ్రీనివాస్, మారే రాజాబాబు తదితరులు ఉన్నారు.

ఆలయాల నిర్మాణానికి శంకుస్థాపన

అయినవిల్లి: విలస గ్రామ పంచాయతీలో కొలువైన గౌతమేశ్వరస్వామి, కేశవస్వామివార్ల ఆలయాల పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ గురువారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ సీజీఎఫ్ నిధులు రూ.47లక్షలు, ఎంపీ నిధులు 28 లక్షలతోను కేశవస్వామివారి ఆలయం, సీజీఎఫ్ నిధులు, రూ.40 లక్షలు, ఎంపీ నిధులు రూ.20లక్షలతోను గౌతమేశ్వరస్వామి వారి ఆలయం నిర్మాణం చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సామాజిక సేవ అభినందనీయం

- ఎంపీపీ గంగాధరరావు
- అంగన్‌వాడీ వర్కర్లు, డీఆర్‌డీఏ వెలుగు వర్కర్లు, ఉపాధి ఎఫ్‌ఏలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అవార్డులు ప్రదానం


కొత్తపేటలో అంగన్‌వాడీ వర్కర్లను సత్కరిస్తున్న ఎంపీపీ గంగాధరరావు, ఎస్ఎస్ఎస్ఓ ప్రెసిడెంట్ స్వర్ణ

కొత్తపేట: సమాజంలో వివిధ సామాజిక వర్గాలకు స్వర్ణ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ పేరిట స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఆదర్శనీయం, అభినందనీయమని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. మేడే సందర్భంగా స్వర్ణ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్స్, డీఆర్‌డీఏ వెలుగు వర్కర్స్, ఉపాధి ఎఫ్‌ఏలకు ×మేడే వర్కర్స్ డే – 2025₹ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అవార్డు₹ ల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గురువారం మధ్యాహ్నం స్థానిక డీఆర్‌డీఓ వెలుగు కార్యాలయంలో నిర్వహించిన సభకు ఆ సంస్థ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ పీ స్వర్ణలత అధ్యక్షత వహించగా ఎంపీపీ గంగాధరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమానికి ప్రభుత్వాల తరపున కృషి చేస్తున్న ఐసీడీఎస్, వెలుగు, ఉపాధి శాఖల్లో పనిచేస్తున్న కింది స్థాయి సిబ్బందిని గుర్తించి అవార్డులతో సత్కరించడం వారిలో ఎంతో ఉత్సాహాన్నిస్తుందన్నారు. అనంతరం ఎంపీపీ గంగాధరరావు చేతుల మీదుగా ఎస్ఎస్ఎస్ఓ ప్రెసిడెంట్ స్వర్ణ ఆయా శాఖల వర్కర్స్‌తో పాటు ఆయా శాఖల అధికారులను, సిబ్బందిని, ×మేడే వర్కర్స్ డే – 2025₹ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అవార్డు₹ కింద సర్టిఫికెట్, శాలువా, మెడల్ ప్రధానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జిల్లా సహకార అధికారి బీవీవీ సత్యనారాయణ, మమత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు కోరుకొండ జాన్, జేఎఫ్ఎస్ ఆర్గనైజర్ వై ప్రదీప్, ఏపీఓ ఎస్ ఆనంద్‌కుమార్, ఏపీఎంపీ విశ్వనాథం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ కే చంద్రకళ, హేమశ్రీ, జే సుల్తానా బేగం తధితరులు పాల్గొన్నారు.

కులగణన చిత్తశుద్ధితో నిర్వహించాలి

మలికిపురం: బహుజన ఐక్య పోరాటం ఫలితంగానే సమగ్ర కులగణనకు కేంద్రం స్పందించిందని బహుజన్ సమాజ్ పార్టీ రాజోలు నియోజకవర్గ అధ్యక్షుడు ఆకుమర్తి భూషణం అన్నారు. గురువారం మలికిపురం పూలే అంబేడ్కర్ భవనంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. పూలే విగ్రహానికి నివాళులు అర్పించారు. ఆకుమర్తి భూషణం మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా చేపట్టని బీసీ కులగణన ఇప్పుడు చిత్తశుద్ధితో జరపాలని, బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన పలు కార్యక్రమాల ఫలితంగానే కేంద్రం దిగి వచ్చిందని చేస్తోందన్నారు. కులగణనలో ఎటువంటి అవకతవకలకు పాల్పడకుండా నిబద్ధతతో జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సాధికారక సంక్షేమ అధ్యక్షులు గుబ్బల బాబ్జి, బహుజన సమాజ్ పార్టీ డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి భూసి జాన్ మోసే, కోశాధికారి జనిపల్లి నాని, సఖినేటిపల్లి మండల అధ్యక్షుడు నల్లి రాజ్‌కుమార్, మలికిపురం మండల అధ్యక్షుడు మోకా శీనుబాబు, పెదపూడి రవి, కుసుమ పద్మ, జి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతుల నుంచి తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలి

కో–ఆర్డినేటర్ శ్రీనివాసరావు


సమావేశంలో మాట్లాడుతున్న పి.గన్నవరం కో–ఆర్డినేటర్ శ్రీనివాసరావు

పి.గన్నవరం: రైతుల వద్ద నుంచి తక్షణం ధాన్యం కొనుగోలు చేసి వారిని ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గం కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పి.గన్నవరంలో గురువారం ఏర్పాటు మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని పరిమితులు విధించి ధాన్యం కొనుగోలు చేయడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రైతుల వద్ద నుంచి ప్రతి గింజ కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచామన్నారు. కానీ నేడు పరిస్థితి చాలా దారుణంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడ చూసినా ధాన్యం రాశులే కనిపిస్తున్నాయని, ప్రస్తుతం ప్రతికూల వాతావరణంలో రైతులు ప్రతిక్షణం భయం భయంగా కాలం వెళ్ల దీస్తున్నారన్నారు. దీనిపై వెంటనే ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, పార్టీ నేతలు పేరి కామేశ్వరరావు, మండపాటి కిరణ్‌కుమార్, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్లు నక్కా వెంకటేశ్వరరావు, పార్టీ నేతలు కుడుపూడి విద్యాసాగర్, విత్తనాల శేఖర్, పార్టీ నేతలు దొమ్మేటి దుర్గారావు, దొమ్మేటి వెంకటశివరామ్, అడ్డగళ్ల సాయిరామ్, పితాని నర్సింహారావు, తులా గోపాలకృష్ణ, కొంబత్తుల ఏసు, గుమ్మడి ప్రసాద్, జక్కంపూడి వాసు, నెల్లి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అరుణపతాక రెపరెపలు

- ఘనంగా ప్రపంచ కార్మిక దినోత్సవం
- గ్రామాల్లో అరుణ పతాకాల ఆవిష్కరణలు


మామిడికుదురులో మేడే పతాకావిష్కరణలో పాల్గొన్న కార్మికులు


కొత్తపేటలో భవన నిర్మాణ కార్మిక సంఘ భవనం వద్ద కార్మిక పతాకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వరరావు


దిండిలో జెండావిష్కరణ చేస్తున్న నాయకులు దేవ రాజేంద్ర ప్రసాద్


రాజోలు మేడే ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వరప్రసాద్

కొత్తపేట: నియోజకవర్గ కేంద్రం కొత్తపేటలో వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం మేడే వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘ భవనం వద్ద కార్మిక సంఘం అధ్యక్షుడు రాకుర్తి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. సంఘ భవనం వద్ద కార్మిక పతాకాన్ని రాకుర్తి వెంకటేశ్వరరావు ఎగురవేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పాలంగి దుర్గారావు, సెక్రటరీ యెలిశెట్టి వెంకటరమణమూర్తి, జాయింట్ సెక్రటరీ బండారు ఆంజనేయులు, ట్రెజరర్ ముద్రగడ వీరభద్రం తదితరులు పాల్గొన్నారు. స్థానిక జట్టు కార్మిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీనియర్ కార్మిక నాయకుడు గంగుమళ్ల రామారావు కార్మిక పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు వెలుగుబంటి వెంకటేశ్వరరావు, ఆలం సత్తిరాజు, ఏపూరి విజయగోపాలకృష్ణ, ఆలం వీరబాబు, వెలుగుబంటి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు. పంచాయతీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు.

మామిడికుదురు: ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడే వేడుకలను మామిడికుదురులో గురువారం ఘనంగా నిర్వహించారు. మామిడికుదురు బస్టాండ్ కూడలిలో మండల ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేడే పతాకాన్ని గ్రామ సర్పంచ్ గౌస్ మొహిద్దీన్ ఆవిష్కరించారు. జగ్గన్నపేట, మామిడికుదురు, పాశర్లపూడి, అప్పనపల్లి ఆటో యూనియన్ల కార్మికులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. శ్రీవినాయక పెయింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మేడే పతకాన్ని యూనియన్ అధ్యక్షుడు అనిశెట్టి పండు ఆవిష్కరించారు. మండల రెవెన్యూ కార్యాలయం వద్ద జరిగిన వేడుకల్లో పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మలికిపురం: మండలంలో గురువారం మేడే ఉత్సవాలు ఘనంగా జరిగాయి. దిండి అమరవీరుల స్థూపంతో పాటు మరో 10 చోట్ల అరుణ పతాకాలను నాయకులు దేవ రాజేంద్రప్రసాద్ ఆవిష్కరించారు. సర్పంచ్ ముదునూరి, శ్రీనివాసరాజు, దేవ సురేషబాబు, సొసైటీ అధ్యక్షులు గొల్ల సుధాకర్, ఇంజేటి శ్యామ్‌బాబు, చింతా సుబ్బారావు, దేవ నరేష్, బత్తుల రవిప్రసాద్, దేవ రాజబాబు, పెదిరెడ్డి రామారావు, ఏనుగుపల్లి నరసింహామూర్తి, అప్పారావు, సోమరాజు తదితరులు పాల్గొన్నారు. రామరాజులంకలో మాజీ సర్పంచ్ బొరుసు సుబ్బారావు, మేడిచర్ల సత్యనారాయణ, చింతా రాజబాబు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. మలికిపురంలో గంటి రత్నరాజు ఆధ్వర్యంలో భారీ ఆటోల ప్రదర్శన నిర్వహించారు. మలికిపురం టాక్సీ స్టాండ్ వద్ద కూడా మేడే నిర్వహించారు.

రాజోలు: మండలంలో మే డే వేడుకలు ఉత్సవాలు నిర్వహించారు. రాజోలులో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయం వద్ద జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్మిక జెండాను ఆవిష్కరించి కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎం.ఎస్.ఆర్.మూర్తి, భూషణం, వాసు తదితరులు పాల్గొన్నారు. శివకోడు లాకు సెంటరులో, కడలి సెంటరులో మేడే వేడుకులు నిర్వహించారు. మేడే ఉత్సవాలు సందర్భంగా రిటైర్డ్ ఎస్సై తాడి బాబూరావు దుప్పట్లు పంపిణీ చేశారు. నాయకులు గంజి అనంతం, మాజీ సర్పంచ్ కడలి శ్రీను, జాలెం జనార్దనరావు, కుసుమ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లి: ముక్తేశ్వరం, వీరవల్లిపాలెం గ్రామాల్లో సీఐటీయూ, ఒలుపు కార్మికుల ఆధ్వర్యంలో మేడే వేడుకలు జరిపారు. మే డే సందర్భంగా సందర్భంగా జెండా వేగుర వేసి కార్మికులంతా ఐక్యతతో పని చేయాలని కోరారు. ప్రభుత్వాలు కార్మికులకు అండగా నిలవాలని కోరారు.

అంబాజీపేట: కార్మికులంతా ఐక్యంగా ఉండి చట్టాలను కాపాడుకోవాలని పలువురు కార్మికులు పేర్కొన్నారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ, ఆశా, 108, 104, మిడ్డేమీల్స్ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో మేడే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముక్కామల, మాచవరం, కె.పెదపూడి తదితర గ్రామాల్లో తాపీ మేస్త్రీ, కొబ్బరి వలుపు, దింపు తదితర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు.

రావులపాలెం: స్థానిక టింబర్ అండ్ సామిల్లు వర్కర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మేడేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుచ్చలపల్లి సుందరయ్య 113వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మే డే పతాకాన్ని టింబర్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతంశెట్టి కనికిరెడ్డి ఆవిష్కరించారు. అలాగే సుందరయ్య చిత్రపటానికి కనికిరెడ్డి, దుళ్ల వెంకటేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గుమ్మడి సత్యనారాయణ, గునిపే శ్రీనివాసరావు, సబ్బితి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎంప్లాయిస్ యూనియన్ గౌర అధ్యక్షుడు ఆర్ఎస్‌రావు జెండా వందనం స్వీకరించారు. వివిధ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

ఆలమూరు : మండలంలోని మేడే వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఆలమూరులోని అమరవీరుల స్థూపం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో మండల కార్యదర్శి జె.యేసురాజు, నియోజకవర్గ కార్యదర్శి కె.రామకృష్ణ, జిల్లా సమితి సభ్యులు వి.శ్యామ్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. అలాగే యూటీఎఫ్, సీఐటీయూ,యూటీఎఫ్, ఎస్‌టీయూ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, అంగన్‌వాడీ, అసంఘటిత కార్మిక సంఘాలు భారీ ర్యాలీ నిర్వహించాయి. పలు చోట్ల కార్మిక సంఘాల నాయకులు ఎర్రజెండాను ఆవిష్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. యూటీఎఫ్ నాయకులు అద్దరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి జి.మనోజ్‌కుమార్, వైవివి.రమణ, కెవిఆర్ బాపూజీచ ఎం,రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


అంబాజీపేటలో మేడే వేడుకలు నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు, కార్మికులు


జెండా ఆవిష్కరించి, సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్మికులు, అసోసియేషన్ సభ్యులు


ఆలమూరులోని అమర స్థూపం వద్ద మేడేను జరుపుకొంటున్న సీపీఐ కార్మిక సంఘాలు